క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



చినగదిలిలో సాయిబాబా పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షిర్డీ సాయి బాబాను వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఆదివారం వేకువ జామున ప్రభాత సేవతో ప్రారంభమైన పూజలు సాయంత్రం పల్లకి సేవతో ముగిశాయి. ఆలయం నిర్వాహకులు, భక్తులు స్వామిని పల్లకిలో చినగదిలి పురవీధులలో ఊరేగించారు.

తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆరిలోవ: ఇటీవల హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కోరింది. విశాలాక్షినగర్‌లోని రెవెన్యూ కాలనీలో ఆదివారం ఏపీజేఏసీ విశాఖ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ రమణయ్య కుటుంబానికి న్యాయం జరిగేవరకు కలసికట్టుగా పోరాడాలని తీర్మానించారు. అనంతరం రమణయ్య కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, విశ్రాంతి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘంటసాలకు భారత రత్న ఇవ్వాలి



నివాళులర్పిస్తున్న గాయని సుహాసిని

బీచ్‌రోడ్డు: స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన గాన గంధర్వుడు ఘంటసాల వేంకటేశ్వరరావుకు భారతరత్న ఇవ్వాలని ప్రముఖ గాయని సుహాసిని ఆనంద్ కోరారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాయకుడిగా, స్వరకర్తగా సేవలందించడమే కాక స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వం సరైన గుర్తింపునివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దాడి సత్యనారాయణ, గంటి మురళీ, రామకృష్ణ, చెన్నా తిరుమలరావు, మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సేవా సంఘం కార్యవర్గం



విశ్వకర్మ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఎస్ఐజీ నగర్‌లో ఆదివారం విశ్వకర్మ సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కానూరి శశిభూషణ్, కార్యదర్శిగా మాచర్ల మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా కలగర నారాయణరావు, ఆర్గనైజర్‌గా గిడిజాల సూరిబాబు, మహిళా మండలి అధ్యక్షురాలిగా గిడిజాల పైడితల్లి తదితరులు ఎన్నికయ్యారు. వీరికి పాత కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం : దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారు తమలపాకులతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

- పోటాపోటీగా తలపడుతున్న జట్లు
- యువతలో జోష్ నింపుతున్న ఆడుదాం ఆంధ్ర



వాలీబాల్‌లో తలపడుతున్న విశాఖ, చిత్తూరు క్రీడాకారిణులు

ఏయూ క్యాంపస్: ఉత్సాహభరిత వాతావరణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం మైదానాల్లో జరుగుతున్న పోటీలు నువ్వా...నేనా అన్నట్టు సాగుతున్నాయి. విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరిస్తూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతున్నారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

ప్రణాళికాబద్ధంగా....
పోటీలు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. మూడు ప్రాంతాల్లో ఏక కాలంలో మూడు క్రీడాంశాలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తున్నారు. ఏయూ బాస్కెట్ బాల్ మైదానం పక్కనే రెండు వాలీబాల్ కోర్టుల్లో బాలురు, బాలికల వాలీబాల్ పోటీలను నిర్వహించారు. జిమ్నాజియం ఎదురుగా ఉన్న సువిశాల మైదానంలో ఖోఖో, కబడ్డీ పోటీలు జరిగాయి.

పోటీలతో క్రీడలపై ఆసక్తి
క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుంది. దీంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, సామర్థ్యం వారికి తెలుస్తుంది. భవిష్యత్తులో శారీరక వ్యాయామానికి, క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడానికి ఇది నాందిగా నిలుస్తుంది. ప్రస్తుతం క్రీడల్లో భాగస్వాములైన యువత భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్‌లలో మరింత బాగా ఆడేందుకు తమనుతాము సమాయత్తం చేసుకునే అవకాశం ఉంటుంది. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసే వేదికగా ఆడుదాం ఆంధ్రా నిలుస్తోందని క్రీడాకారులు, కోచ్‌లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లు భేష్
క్రీడాకారుల కోసం క్రీడా వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. టిఫిన్, భోజనం సమయానికి ప్రాంగణాలకు చేర్చి, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. క్రీడాకారులు కడుపు నిండా ఆహారం తీసుకుని ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతి క్రీడా వేదిక వద్ద మంచినీటి సదుపాయం కల్పించడతో పాటు, టాయిలెట్స్‌ని జీవీఎంసీ ఏర్పాటు చేసింది. క్రీడా వేదికల వద్ద పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. క్రీడా మైదానం, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. క్రీడాకారులకు, ఇతర అధికారులకు ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్, దూరవిద్య కేంద్రం గెస్ట్‌హౌస్‌లలో వసతి కల్పించారు. ఇక్కడ దోమల బెడద లేకుండా ముందు జాగ్రత్తగా జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో సౌకర్యాలు
క్రీడా కారులకు సౌకర్యాల కల్పనలో అధికారులు రాజీపడలేదు. క్రీడా ప్రాంగణాలలో కూర్చుని పోటీలను వీక్షించడానికి వీలుగా కుర్చీలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రత్యేకంగా ఉన్న పెవిలియన్ల నుంచి కూడా క్రీడాకారులు పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీలను వీక్షిస్తూ ప్రోత్సహించడం కనిపించింది. క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు. క్రీడలను వీక్షించేవారి కోసం ప్రత్యేకంగా టెంట్లు వేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులకు బిస్కట్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్‌లను అందజేస్తున్నారు. వేదికల వద్ద ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాల్లో.. ఆటల్లో భాగంగా తగిలిన చిన్నపాటి దెబ్బలకు చికిత్స అందజేసి, మందులను అందజేస్తున్నారు.



ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ ఉద్యోగి



క్రీడా ప్రాంగణాల వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్

వృద్ధాప్యంతో మతిమరపు సమస్యలు



క్లబ్ సభ్యుడిని సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఏయూ క్యాంపస్: వృద్ధాప్యం కారణంగా మతిమరుపు వస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.సూర్య తేజ అన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే నెలవారి ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం వృద్ధాప్య సమస్యలపై డాక్టర్ సూర్యతేజ ప్రసంగించారు. వ్యాయామం చేయడం, పుస్తకాలు చదవడం, ప్రతి రోజు ఉత్సాహంగా దినచర్యలు పూర్తిచేయడం ఎంతో అవసరమన్నారు. ఇటువంటివి చేయడం వల్ల మతిమరుపు దరిచేరకుండా జాగ్రత్త పడవచ్చని డాక్టర్ సూర్య తేజ సూచించారు. వృద్ధులకు సంబంధించిన వివిధ ఆరోగ్యసమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. అనంతరం క్లబ్ సభ్యుడు సాంబశివరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాస రెడ్డి, కార్యదర్శి జి.తిరుపతి రావు, కోశాధికారి స్వామినాయుడు, సీనియర్ సభ్యులు బి.రమణయ్య, ఎం.వెంకటరావు,డాక్టర్ పెదసోములు పాల్గొన్నారు. ప్రతినెల క్లబ్ ఆధ్వర్యంలో ఉడా పార్క్‌లో అందరికీ ఉపయుక్తంగా ఉండే ఆరోగ్య సంబంధిత అంశాలపై నిపుణుల ప్రసంగాలు, సూచనలు ఏర్పాటు చేస్తున్నారు. అనంతం క్లబ్ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించారు.

వైభవోపేతంగా శ్రీనివాస కల్యాణోత్సవం



టీపీటీ కాలనీలో శ్రీనివాసుడికి తిరువీధి నిర్వహిస్తున్న ఉత్సవ నిర్వాహకులు



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో శృతిలయ ఆధ్యాత్మిక భక్తి సంకీర్తన సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం వైఖానస ఆగమ సంప్రదాయంలో రంగనాథ ఆచార్యులు బృందంచే భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగా వైభవంగా కల్యాణం జరిగింది. శృతిలయ బృందం గాయనీగాయకులు కల్యాణోత్సవంలోని మధుర ఘట్టాల సన్నివేశాలకు అనుగుణంగా అన్నమాచార్య సంకీర్తనలను మధురంగా ఆలపించారు. తిరువీధి మహోత్సవం సంప్రదాయ రీతిలో జరిగింది. తిరుమల దేవస్థానానికి చెందిన ఆధ్యాత్మిక వ్యాఖ్యాత శ్రీమాన్ అక్కెళ్ల విభీషణ శర్మ స్వామి, అమ్మవార్లకు దివ్య మంగళ హారతి ఇచ్చి కొబ్బరికాయకొట్టి తిరువీధిని ప్రారంభించారు. సీతమ్మధార త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నను మంగళధ్వని, వేద మంత్రాలతో కోలాటం, సంకీర్తనలు, శ్రీరామచంద్రమూర్తి,నారదుడు తదితర పౌరాణిక పాత్రలతో, శ్రీవిష్ణు సహస్ర నామం, గోవింద నామ సంకీర్తనలతో టీపీటీ కాలనీలోని ద్రావిడ కల్యాణ మండపం వద్దకు తిరువీధిగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో కె.ఎ.రాజు, ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వంకాయల సన్యాసిరాజు, డాక్టర్ ఎన్ఎఎన్ మూర్తి, ఏపీఎస్ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాలుగా రోడ్లు



చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ కొత్త రోడ్డులో నిలిపిన కార్లు

ఆరిలోవ: రోడ్లు పార్కింగ్ స్థలాలుగా మారుతున్నాయి. రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ పలువురు వాహనాలు నిలిపేస్తున్నారు. ఇటీవల రూ.కోట్లు ఖర్చుచేసి నిర్మించిన రోడ్డు కార్లు, లారీలు, ట్రావెల్ బస్సులకు పార్కింగ్ స్థలంగా మారిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి బీఆర్‌టీఎస్‌లో చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ వరకు సుమారు 400 మీటర్ల పొడవున 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.35 కోట్లతో జీవీఎంసీ అధికారులు రోడ్డు నిర్మించారు. దీన్ని ఈనెల 6న ప్రారంభించిన విషయం తెలిసిందే. సుమారు 20 అడుగుల వెడల్పుతో ఇరుకుగా ఉండే ఈ రోడ్డు ఇప్పుడు 80 అడుగుల డబుల్ రోడ్డుగా మారింది. సెంట్రల్ లైటింగ్, ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లతో అందగా తయారు చేశారు. దీంతో ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య తీరింది. కానీ రూ.కోట్లతో నిర్మించిన ఈ రోడ్డుపై కొందరు కార్లు,లారీలు,అంబులెన్స్‌లు, చికెన్ షాపులకు కోళ్లు సరఫరా చేసే వ్యానులు, ట్రావెల్ బస్సులు, ఆటోలను నిలిపివేస్తున్నారు. కొన్ని వాహనాలను రోజులు తరబడి నిలిపి వేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన్పటి నుంచి ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ రోడ్డు ఇరుకుగా మారి మళ్లీ సమస్య మొదలైందని, రూ.కోట్లు ఖర్చుచేసినా ఫలితం లేకుండాపోయిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని, వాహన రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని స్థానికులు,వాహనచోదకులుఅధికారులను కోరుతున్నారు.

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

ఎంవీపీకాలనీ: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నగర బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నగర పార్టీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తొలుత పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ దేశసేవే జీవన విధానంగా మార్చుకున్న మహోన్నత వ్యక్తి దీనదయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. ఈ సందర్భంగా లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'పీవీ' కి భారత రత్న ప్రకటించడంపై హర్షం



పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బీచ్‌రోడ్డు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించటం పట్ల వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రామ్‌నగర్‌లోని పీవీ నరసింహారావు విగ్రహానికి పలువురు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెంచురీయన్ యూనివర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్. రాజు, టి.ఎస్.ఆర్. ప్రసాద్, అవధాని, ద్రోణంరాజు శ్రీవత్సవ్, వుడా రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు: శివాజీపాలెం పార్కు రోడ్డులో గల అన్నపూర్ణ అపార్టమెంట్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్టు సాధన సంస్థ చైర్మన్ ఈ.సత్యానంద్ కుమార్ తెలిపారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్‌కు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేసినట్టు ఆయన చెప్పారు.

పేదల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ

మద్దిలపాలెం: పేదల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించి ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పర్చుకున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం 15వ వార్డులో కొండవాలు ప్రాంతమైన కొత్త వెంకోజీపాలెంలో స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వార్డు దారులు పొందిన సంక్షేమ లబ్ధి, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఎం.వి.వి. వివరించారు. నాడు పెన్షన్ సొమ్ము కోసం పండుటాకులు మండుటెండలో కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేదని ఆయన చెప్పారు. ఇప్పుడు ఒకటో తేదీనే ఇంటి వద్దనే వేకువజామును ఠంఛన్‌గా పెన్షన్ తీసుకుంటూ మురిసిపోతున్న వృద్ధులను చూస్తున్నామని తెలిపారు. అక్కచెల్లెల్లు, తల్లీబిడ్డల ఇలా అన్ని వర్గాల వారికి కావాల్సిన ఆర్థిక భరోసాను అందిస్తున్న పెద్ద మనస్సున్న నాయకుడు సీఎం జగన్న ఉన్నారనే ధైర్యంతో అందరూ ఉన్నారన్నారు. మళ్లీ జగన్ననే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వార్డు నాయకులు అప్పారి గిరిబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పీలా జోషిలా, పీలా వెంకట్, వెంకటలక్ష్మి, రత్నం, అచ్యుత, సత్తిబాబు, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అవగాహనతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ



డాక్టర్ల సమక్షంలో క్యాన్సర్ జయించిన చిన్నారులు

ఎంవీపీకాలనీ: అవగాహన, ముందస్తు గుర్తింపుతోనే పిల్లల్లో క్యాన్సర్ మరణాల నివారణ సాధ్యమవుతందని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ బాలల క్యాన్సర్ నివారణ డే సందర్భంగా ఎంవీపీ కాలనీలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, శ్రేయ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏటా 0 నుంచి 19 ఏళ్ల వయసు గల 4 లక్షల మంది చిన్నారులు క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. పిల్లల్లో క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ అత్యంత కీలకమన్నారు. ముందస్తు నిర్ధారణతో వారికి ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్‌పై అవగాహన పెంచే దిశగా మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ ఇతరులకు అవగాహన పెంచే విధంగా క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలిస్టాలిన్ చౌదరి, డాక్టర్ వి.ప్రవీణ, డాక్టర్ వై.రజనీ, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు

- కొనసాగిన సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు
- వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

రైతు బజార్‌లో అధిక ధరలకు విక్రయాలు

నష్టపోతున్న కొనుగోలుదారులు

ఏయూక్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌లో వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. అధిక ధరలకు విక్రయిస్తుండడంతో నష్టపోతున్నారు. ఆదివారం ఒక వినియోగదారుడు పావుకిలో వెల్లుల్లిపాయలు కొన్నాడు. పావుకిలో వెల్లుల్లికి వ్యాపారి రూ.85 తీసుకున్నారు. వినియోగదారుడికి అనుమానం వచ్చి రైతుబజార్ ఈవోను వెల్లుల్లి ధర ఎంత ఉందని అడిగారు. కిలో రూ.280 అని ఆమె చెప్పారు. తన వద్ద పావు కిలోకు రూ.70 తీసుకోవాల్సి ఉండగా, రూ.85 తీసుకున్నారని దుకాణదారునిపై ఈవోకు మౌఖికంగా వినియోగదారుడు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే సదరు దుకాణదారుడిని పిలిపించి అడగగా ధర ఎక్కువగా ఉన్నప్పుడు తాను కొన్నానని, అందుకే తాను ఎక్కువకు అమ్ముతున్నట్లు సమాధానమిచ్చారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలని ఈవో చెప్పడంతో అధికంగా వసూలు చేసిన రూ.15 తిరిగి వినియోగదారుడికి ఇచ్చారు. ఈ లెక్కన వెల్లుల్లిపై కిలోకు రూ.60 అధికంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ దుకాణాల్లో విక్రయించే నిత్యావసరాలలో నాణ్యత తక్కువగా ఉండడమే కాకుండా ధర ఎక్కువగా ఉంటోందని తరచూ వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరించడమే దీనికి కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఇక్కడ విక్రయించే కూరగాయల్లో నాణ్యత ఉండడం లేదని, బోర్డు ధరకు విక్రయాలు జరపడం సక్రమంగా జరగడం లేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. రైతులెవ్వరూ కాలీఫ్లవర్‌ను కిలోల లెక్కన అమ్మకాలు జరపడం లేదు.

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగార్చన



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సూర్య దేవునికి విశేష పూజలు

సింహాచలం : మాఘ మాసంలో తొలి ఆదివారాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురం గోశాల సమీపంలోని సప్త అశ్వవాహన సమేత సూర్యానారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజలు నిర్వహించారు.